విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేయండి : కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాలోని పాఠశాలల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పోషణ పక్షోత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విటమిన్ గార్డెన్లల్లో పోషకాహార కూరగాయలు పండించాలన్నారు. మహిళలు, విద్యార్థులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించాలని, తక్కువ ఖర్చుతో పోషకాహార ఫుడ్ తయారు చేసుకునేలా చైతన్యం తేవాలని సూచించారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రతి వస్తువుపై ఉన్న లేబుల్స్ తెలిసేలా వారంలో ఒకరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన వస్తువు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. జిల్లా, మండల స్థాయిలో ఫుడ్ తయారీపై కాంపిటీషన్ పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఇందులో ప్రతి చూపిన భార్యాభర్తలకు బహుమతులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాల నియంత్రణకు అందరూ సహకరించాలని తెలిపారు.

కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలుపుతాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మెడికల్ కాలేజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో ఎమ్మెల్యేల సహకారంతో అగ్రభాగాన నిలుపుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో రూ.150 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవన నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 8మంది ఎమ్మెల్యేల సహకారంతో కరీంనగర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. గతంలో జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయాలని తాను పోరాటం చేశానని అన్నారు. అనంతరం సర్కారు మెడికల్ కాలేజ్ మంజూరు చేసిందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా మెడికల్ కాలేజ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. అన్ని రకాల వసతులు కల్పిస్తామని తెలిపారు. విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తున్నదని, విద్యాపరంగా కరీంనగర్ జిల్లాను ముందుంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, కొత్తపల్లి మున్సిపాలిటీ చైర్మెన్ రుద్ర రాజు, ఎంపీపీ పిల్లి శ్రీలత, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

కొత్తపల్లి మండలం ఖాజీపూర్ (సాయినగర్)లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పంటలకు విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీఓ కే.మహేశ్వర్, ఎంపీపీ పిల్లి శ్రీలత, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ పాల్గొన్నారు.



బ్రిడ్జి హామీ నిలబెట్టుకోవాలని నిరసన

జేఏసీ నాయకుల అరెస్ట్



జేఏసీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ - గన్నేరువరం

ఎంపీ బండి సంజయ్ నిర్వహిస్తున్న ప్రజాహిత యాత్రలో భాగంగా శుక్రవారం గన్నేరువరం మండలంలో పర్యటించనుండగా బ్రిడ్జి జేఏసీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద బండి సంజయ్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన చేస్తున్న బ్రిడ్జి సాధన జేఏసీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చని బండి సంజయ్ గన్నేరువరం మండలంలో ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయాడని అన్నారు. ఎంపీగా గెలిచి ఏ ఒక్క అభివృద్ధి చేయని బండి సంజయ్ మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం విడ్డూరమని అన్నారు. అరెస్టులకు, కేసులకు భయపడేది లేదని బ్రిడ్జి హామీ నెరవేర్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో మండలంలో తిరగనీయబోమని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో బ్రిడ్జి సాధన సమితి జేఏసీ అధ్యక్షుడు సంపతి ఉదయ్ కుమార్, భామండ్ల రవీందర్, పుల్లెల జగన్, రాములు, కయ్యం సంపత్, రాజయ్య ఉన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో (24)7.ఏఐ కంపెనీ జాబ్‌మేళా నిర్వహించారు. సుమారు 322 మంది హాజరు కాగా 58మంది విద్యార్థినులు చాట్ ప్రాసెస్ అండ్ వాయిస్ ప్రాసెస్‌గా ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ విద్యాబోధనతో పాటు పోటీ పరీక్షలకు కావలసిన భాషా నైపుణ్యం, అర్థమెటిక్, రీజనింగ్, వర్బల్ ఎబిలిటీ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులు ప్రతిభావంతులుగా రాణిస్తూ వివిధ దేశీయ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో టాస్క్ జిల్లా సమన్వయకర్త గంగాప్రసాద్, హెచ్‌ఆర్ మేనేజర్ నరేందర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్, టీపీఓ డాక్టర్ బి.విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నేతలు

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొత్తూరి సురేష్, బొడ్డు నాగరావు, కొత్తూరి అనిల్, బంధరకంటి సామ్యేల్, ద్యావ సురేశ్ , దాసరి అనోజ, మామిడిపెల్లి అనిత పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ - గంగాధర

మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ప్రకటించడాన్ని హర్షిస్తూ గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మడ్లపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సత్తు కనకయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమళ్ళ మనోహర్, గంగాధర సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, నాయకులు పానుగంటి సత్యం, రామిడి రాజిరెడ్డి పాల్గొన్నారు.

టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ - తిమ్మాపూర్



తెలంగాణ రాష్ట్ర టీఎన్జీవో నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను నుస్తులాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఆయన వెంట జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

కార్పొరేషన్లతో సామాజిక న్యాయం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య

నవతెలంగాణ - జమ్మికుంట

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ల ఏర్పాటుతో తెలంగాణలో సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టిందని జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్లతో సామాజిక తరగతుల వారీగా న్యాయం చేకూరుతుందన్నారు. వెనకబడిన వారికి పెద్దపీట వేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన, చెప్పని హామీలను సైతం అమలు చేస్తోందన్నారు.

ఉపాధి కూలీలకు కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

నవతెలంగాణ - మానకొండూర్

ఉపాధి హామీ కూలీలకు కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మానకొండూర్‌లో ఉపాధి కార్మికులు పని చేసే ప్రదేశాన్ని సందర్శించి వారితో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం చట్టాలను కాపాడుకోవాలని, వాటిని అమలు చేయడం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కూలీలు చేసిన పనికి స్లిప్పులు ఇచ్చి డబ్బులు వారం రోజులు ఇవ్వాలని, అలాగే పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. రెండుసార్లు ఫొటో పద్ధతి రద్దు చేసి, కొలతలు లేకుండా రూ.600 కూలి ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం మొదటి బడ్జెట్ రూ.1 కోటి 18 లక్షలు తగ్గించకుండా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పక్షాన డిమాండ్ చేశారు.

ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

గాయత్రి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ముష్క వీరరాజు

అట్టహాసంగా కళాశాల వార్షికోత్సవం

నవతెలంగాణ - జమ్మికుంట



బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ ముష్క వీరరాజు

విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికబద్ధంగా ఇష్టపడి చదివి తమ లక్ష్యాన్ని చేరుకోవాలని గాయత్రి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ముష్క వీరరాజు అన్నారు. శుక్రవారం స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ముష్క వీరరాజు మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుపై ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలు రూపొందిస్తూ, జిల్లా స్థాయి డిగ్రీ కళాశాలకు ధీటుగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్టు చెప్పారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌పైన ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామన్నారు. కళాశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలలో 70శాతం విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ప్రస్తుతం విద్యార్థులు పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కరస్పాండెంట్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, అధ్యాపకులు అంజిబాబు, రమేష్, సాగర్, చంద్రయ్య, కరుణ, భాస్కర్ పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం చైర్మన్ రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. రూ.24కోట్లా 4లక్షలా 74వేలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చైర్మన్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్, కౌన్సిలర్‌లు, మేనేజర్ భూపాల్‌రెడ్డి, జేఏఓ విమల పాల్గొన్నారు.

ఇల్లందకుంట దేవస్థాన పాలకవర్గం ఏర్పాటయ్యేనా..?

పది సంవత్సరాలుగా కమిటీకి దూరంగా ఉన్న నేతలు

ఈ ఏడాదైనా చోటు కోసం కాంగ్రెస్ నేతల యత్నం..



నవతెలంగాణ - ఇల్లందకుంట

తెలంగాణ రాష్ట్రంలో భద్రాచలం శ్రీ సీతారాముల దేవస్థానం తరువాత అపర భద్రాద్రిగా ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం పేరు గాంచింది. ఈ ఆలయ పాలకవర్గం ఈ ఏడాదైనా ఏర్పాటు అవుతుందో, లేదోనని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. కరోనా కంటే ముందు పాలకవర్గం ఏర్పాటు చేయగా, కరోన సమయంలో రెండేండ్లపాటు ఉత్సవాలు నామమాత్రంగా నిర్వహించడంతో రెనోవేషన్ కమిటీతోనే సరిపెట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పాలకవర్గం ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటారేమోనని ఈ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. ఇల్లందకుంట మండలంతో పాటు జమ్మికుంట, హనుమకొండ జిల్లాలోని కమలాపూర్, వీణవంక మండలాలకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ దృష్టికి పాలకవర్గం విషయాన్ని తీసుకువెళ్లినట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. ప్రతి ఏటా శ్రీరామనవమి నుండి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేస్తుంటారు. వీరి నేతృత్వంలోనే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శాశ్వత కమిటీ అయితే రెండు సంవత్సరాల పాటు ఉత్సవాలను ఆ కమిటీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. శాశ్వత పాలకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ముగిసే సమయానికి వారి పదవి కాలం కూడా ముగుస్తుంది. పది సంవత్సరాలుగా కమిటీకి దూరంగా ఉన్న కాంగ్రెస్ నేతలు ఈ ఏడాది ఎలాగైనా కమిటీలో చోటు సంపాదించుకోవాలని ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు.

టీజీపీఏ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా సంగుపట్ల మల్లేశం

నవతెలంగాణ - తిమ్మాపూర్



నియామక పత్రం అందుకుంటున్న మల్లేశం

తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపిఏ) కరీంనగర్‌లో నాలుగు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఆఫీస్ బెరర్లు, కార్యవర్గ సభ్యులతో సమీక్ష సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె పవన్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంగుపట్ల మల్లేశంను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సమావేశంలో నాలుగు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు నగునూరు చందు, సిలుముల సంజు, కొండి సత్యం, కే.లింగమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి



నవతెలంగాణ - జమ్మికుంట

వస్తువులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని బాలవికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని మడిపల్లి గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు చైతన్యవంతులు కావాలని అన్నారు. వినియోగదారుల పరిరక్షణ చట్టం 1986లో వచ్చినప్పటికీ ప్రభుత్వాలు పగడ్బందీగా అమలు చేయలేకపోవడం వల్ల నీరుగారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం పట్ల సామాన్య ప్రజలలో అవగాహన తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. బిల్లులు తీసుకున్నప్పుడే ఏదైనా మోసం జరిగితే వినియోగదారుల ఫోరంలో కేసు వేయవచ్చునని, కేసు వేస్తే నష్టపోయిన వినియోగదారులకు కోర్టు ఖర్చులతో సహా నష్టపరిహారం చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ స్వాతి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేకల మార్కెట్‌కు ఎంపీ బండి సంజయ్ నిధులు మంజూరు




ఎంపీ మంజూరు చేసిన 3లక్షల ప్రొసీడింగ్ కాపీతో యాదవ రాజన్నల సంఘం సభ్యులు

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండలంలోని ఆర్నకొండ గ్రామంలోని యాదవ రాజన్నల కులస్తుల మేకల మార్కెట్ (మండి) కాంపౌండ్ వాల్‌కు గతంలో వినతిపత్రాన్ని అందజేయగా స్పందించిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ రూ.5లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మొదటి విడత 3 లక్షలు మంజూరు చేశారు. రెండు లక్షలు మే నెలలో మంజూరు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం యాదవ రాజన్నల సంఘం ప్రెసిడెంట్ మెరుగు జన్నయ్య మాట్లాడుతూ అడగగానే స్పందించి నిధులు మంజూరు చేయించిన ఎంపీ బండి సంజయ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మొగిలి సారయ్య, ఉపాధ్యక్షుడు జక్కుల సారయ్య, కోశాధికారి మొగిలి రాజయ్య, కార్యదర్శులు జక్కుల కొమురయ్య, రాజయ్య, మల్లయ్య, సమ్మయ్య, రాజ మల్లయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వంగాల లక్ష్మారెడ్డి మృతిచెందాడు. అతని కుటుంబాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయనవెంట ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోగూరి నర్సింహారెడ్డి, మండల ప్రజాపరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాజోద్దీన్, నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జగిత్యాల
శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతం



నవతెలంగాణ-మేడిపల్లి

ఉమ్మడి మేడిపల్లి మండలంలోని పోరుమల్ల, తొంబర్రావుపేట, కొండాపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను ఎంపీపీ దొనకంటి ఉమాదేవి ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తౌటి తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ మానస, ఏఎన్‌ఎం సరస్వతి ఆశాకార్యకర్తలు సుజాత శారద, అంగన్‌వాడీ టీచర్లు శంకరమ్మ, రేణుక, రాధ, విజయ, శ్రీలత, రవళి, భాగ్యలక్ష్మి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలే భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఒంటి పూట బడి.. జర జాగ్రత్త..!

నవతెలంగాణ- జగిత్యాల

వేసవి కాలం వచ్చిందంటే.. పిల్లల్లో చెప్పలేని ఉత్సాహం. ఒంటి పూట బడుల కారణంగా సమయం ముగిసిందంటే మధ్యాహ్నం ఆటపాటల్లో విద్యార్థులంతా సరదాగా గడిపేందుకే ఉత్సాహం చూపిస్తుంటారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కాలువలు, వ్యవసాయ బావుల్లో ఈత కొడుతూ ఎండ వేడిమి నుంచి ఉపసమయం పొందుతుంటారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినప్పటికీ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా సరదామాటున ప్రమాదాలు పొంచి ఉంటాయని తల్లిదండ్రులు గుర్తించాలి. ఉష్ణతాపం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పిల్లలకు అవగాహన కల్పించాలని వైద్యులు చెపుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మార్చి 15 నుంచి ఒంటి పూట బడులను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో చిన్నారుల సంరక్షణలో తల్లిదండ్రులు తీసు కోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సూర్య కిరణాలు నిటారుగా భూమిపై పడతాయి. ఆసమయంలో ఎక్కువగా బయట తిరిగితే అతినీలలోహిత కిరణాలు నేరుగా చర్మంపై పడి చర్మాన్ని దెబ్బతీస్తాయి. మరో వైపు అంత ర్గతంగా కూడా ఈ కిరణాల ప్రభావం ఉంటుందని వైద్యులు చెపుతున్నారు.

ఒంటి పూట బడి అవగానే ఇంటికి వచ్చిన పిల్లలను తప్పనిసరిగా అయితే తప్ప ఎండపూట బయటకు వెళ్లనివ్వకూడదు.

చిన్నపిల్లలను పాఠశాల నుంచి ఇంటికి తీసుకువచ్చే సమయంలో గొడుగు వాడాలి.

ప్రయాణాల సమయంలో ద్విచక్ర వాహనంపై పిల్లలను మధ్యాహ్నం పూట



ముందు భాగంలో కూర్చోపెట్టుకుంటే వడ గాలులు నేరుగా తగిలి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. వారిని వెనుక కూర్చోబెట్టుకోవాలి

-పిల్లలు తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సివస్తే టోపీ పెట్టుకునేలా ప్రోత్సహించాలి. తల, ముఖభాగం పూర్తిగా కప్పి ఉంచేలా వస్త్రం కట్టుకుంటే ఇంకా మంచిది.

బోర్ ఫీలవకుండా

ఇంట్లో ఖాళీగా ఉంటే పిల్లలు బోర్‌గా ఫీలయ్యే అవకాశం ఉన్నందున వారికి కొత్త ఆటలు గాని విజ్ఞానాన్ని పంచే అంశాలపై దృష్టి సారించేలా చూడాలి. వీలైనంత మేర తల్లిదండ్రులు తమ పిల్లలతో గడిపేందుకు ప్రయత్నించాలి. పాఠశాలల్లో ఇచ్చిన హోమ్‌వర్క్ మధ్యాహ్నం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలి.

ఒంటి పూట బడుల కారణంగా బడికి వెళ్లే పిల్లలు మధ్యాహ్నం ఖాళీగా ఉండటం ఇష్టం లేక వీలైనంద వరకు తోటి స్నేహితులతో సరదాగా కాలం గడపాలని చూస్తారు. పిల్లలకు వేసవిలో కలిగే ఇబ్బందులను దష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహిస్తుందని గమనించాలి. నిర్లక్ష్యం చేస్తే తెలిసీ తెలియని వయస్సులో ఉన్న పిల్లల ఆరోగ్యంతోపాటు వారి ప్రాణాలపై ప్రభావం పడుతుందనే విషయం తల్లిదండ్రులు గమనించాలి.

ఆహారం.. అలవాటు

-పెందలాడే బడికి వెళ్లాలంటే తొందరగా నిద్రలేవాలి. తేలికపాటి ఆహారం తీసుకోవాలి. ఇడ్లీ అయితే భేష్. పండ్లయినా ఫర్వాలేదు.

-అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో కూరగాయలకే ప్రాధాన్యమివ్వాలి. మాంసాహారానికి దూరంగా ఉండటం శ్రేయస్కరం..

బడిలో ఉండే సమయంలో అప్పుడప్పుడు ద్రవ పదార్థాలు, పానీయాలు, నీరు

-తీసుకునేలా ఉపాధ్యాయులకు సూచిస్తే బాగుంటుంది.

-ఒంటి పూట బడులని చదువులకు దూరం కావద్దు. మధ్యాహ్నం ఇంటికి వచ్చాక కాసేపు విశ్రాంతి తీసుకుంటే మేలు.

-ఆటలాడుకునే సమయం పోను మిగతాది చదువుకు కేటాయించాలి..

-రాత్రి వేళ త్వరగా పడుకుంటే ఉదయం నిద్ర లేవడంలో ఇబ్బందులుండవు..

కాన్షీరామ్‌కి భారతరత్న ప్రకటించాలి



కాన్సీరాం చిత్ర పటానికి పూలమాల వేస్తున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-జగిత్యాల

బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్సీరాంకి భారతరత్న ప్రకటించాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మాన్యవర్ కాన్షీరాం 90వ జయంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి చిర్ర శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి సంపత్ కుమార్, జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బిఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షులు ధూమాల రాజకుమార్ పాల్గొన్నారు.

మొహిజ్ కుటుంబానికి రూ.3లక్షల ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

నవతెలంగాణ-జగిత్యాల

ప్రమాదవశాత్తు మరణించిన మోహిజ్ కుటుంబానికి మూడు లక్షల ఆర్థిక సాయాన్ని జడ్పీ చైర్ పర్సన్ దావవసంత సురేష్ అందజేశారు. అలాగే వారి సతీమణికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియమక ఉత్తర్వులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈఓ, జిల్లా పరిషత్ ఉద్యోగులు సహకారంతో 3లక్షల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత




పరీక్షా సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-మేడిపల్లి.

భీమారం మండలం కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 2018-19 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేస్తూ పరీక్ష రాసే విధానంపై సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ సభా స్థలి పరిశీలన



నవతెలంగాణ-జగిత్యాల

జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా జగిత్యాల పట్టణంలో జరుగు సభా స్థలం, హెలిప్యాడ్, వీఐపీ పార్కింగ్, ట్రాఫిక్ రూట్లు సభా స్థలికి వచ్చి వెళ్లే దారులు జనరల్ పార్కింగ్ ప్రదేశాలను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పరిశీలించారు. అనతరం బందోబస్తు ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీలు రఘు చందర్,రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి కోసం పని చేస్తాం

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ. జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం రాజీ పడేది లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై 5వ వార్డు కౌన్సిలర్ గుగ్గిల్ల హరీష్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ టీ. జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పట్టణ సమగ్రాభివృద్ధే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అన్ని రంగాల్లో జగిత్యాలను అభివృద్ధి పథంలో తీసుకువెళ్తమన్నారు. దీనికి ప్రజలు మద్దతునివ్వాలని, మరోసారి నిజామాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్నానని దీనికి ప్రజల ఆశీర్వాదం కావాలని కోరారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు జగిత్యాల పట్టణాన్ని నిర్మాణాత్మకంగా అభివృద్ధి చేశామని అసలు జగిత్యాల అభివృద్ధికి బాటలు వేసిందే కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. అధికా రంలోకి రాగానే తై బజార్ పన్ను రద్దు చేస్తాం అని హామీ ఇచ్చారు. గృహలక్ష్మి పథకం కింద బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం మంజూరు పత్రాలు మాత్రమే ఇచిందని, కానీ ఆ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే అమలు అవుతుందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని రాబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసేది కాంగ్రెస్ పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఇవ్వకుండా దేశ యువతను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీనవన్‌రెడ్డి

విమర్శించారు. అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం అని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ.. జగిత్యాలలో అభివృద్ధి పనులను త్వరలోనే చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తుందని, ప్రతీ వార్డులో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డులుగా తీర్చిదిద్దుతా మన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి సంక్షేమ పథకా లను అమలు చేస్తామన్నారు. అర్హులందరికీ పథకాలు అందిస్తామని చైర్పర్సన్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ లక్ష్మి దేవేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, బండ శంకర్, కొత్త మోహన్, అడెపు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ధర్మోజి కుంటపై పట్టింపు ఏదీ?



నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని గోవిందారం ఆటవిక ప్రాంతంలో ఉన్న ధర్మోజికుంట, ఆనుకొని ఉన్న చెక్ డ్యామ్ మత్తడి ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయి నీరు నిల్వ లేకుండా పోయింది. గతంలో పంది గుట్ట సమీపంలో అటవీశాఖ అధికారులు సెప్టెంబర్ 2002లో కంప-ఎన్ఎఫ్ ఎం-ఏఎస్‌ఆర్ పథకం కింద చెక్ డ్యామ్ నిర్మించినప్పటికి గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మరల మార్చి 2022లో చెక్ డ్యామ్ మరమ్మతులు రెండు దశాబ్దాల అనంతరం చేశారు. మరల యధావిధంగా ధర్మాజీకుంటను ఆనుకొని ఉన్న చెక్ డ్యాం మత్తడిలో నీరు నిలువలేక వన్యప్రాణులకు వేసవి రిత్యా తాగునీరు అందకుండా పోయింది. సంబంధిత అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఇలాంటి నివేదిక లేకుండానే ఖాళీగా ఎస్టిమేట్ చూపించారు. ధర్మోజికుంట చెక్ డ్యామ్‌లో నీరు నిల్వ లేకుండా ప్రత్యక్షంగా వన్యప్రాణులు, మూగజీవాలు దాహర్తి తీర్చుకోవడానికి అటవీ ప్రాంతాన్ని దాటే సమయంలో వేటగాళ్లకు చిక్కి బలవుతున్నాయి. సంఘటనలు పునరావతం కాకుండా సంబంధిత జిల్లాస్థాయి ఉన్నత అధికా రులు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, సమన్వయం చేసుకొని వన్యప్రాణుల దాహర్తిని తీర్చాలని ప్రకతి ప్రియులు, మండల ప్రజలు కోరుచున్నారు.

పశువులకు ఉచిత గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-జగిత్యాల

మండలంలోని మోరపల్లి గ్రామంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సహాయ సంచాలకులు డాక్టర్ బోనగిరి నరేష్ ప్రారంభించారు. మొరపల్లి గ్రామంలోని సుమారు 320 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్య అధికారి డాక్టర్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ బోనగిరి మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి వైరస్ ప్రధానంగా గాలి, వ్యాధి గ్రస్త పశువుల విసర్జితాల ద్వారా వ్యాపి స్తుందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులలో నోటి పుండ్లు, కాలి గిట్టల మధ్యలో పుండ్లు ఏర్పడి లాలా జలం కారుతుందన్నారు. పాల దిగుబడి కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. మేత సరిగా మేయక నీరసించి చివరకు చనిపోతాయి అన్నారు. గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు 3 నెలల వయసు దాటిన జీవాలకు వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ పత్తి రెడ్డి మహిపాల్ రెడ్డి, ఎంపీటీసీ భూమా రెడ్డి, పశు వైద్యాధికారి గడ్డం నరేష్, రైతులు వేణు రావు , భీంరావు, రాం మోహన్, పశు వైద్య సిబ్బంది నాగేందర్, అనిల్,పోచయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

మేడిపల్లి: మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి గ్రామంలో వెటర్నరీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారిని డాక్టర్ వెన్నెల ఆధ్వర్యంలో సుమారు 232 పశు వులకు టీకాలు వేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవివో సురేఖ, వెటర్నరీ అసిస్టెంట్ లచ్చయ్య, ఎంపీటీసీ నాయని మమతా రవి గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. జగిత్యాల రూరల్ మండలం మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేశ్, బారతపు రమేష్, కావటి గంగాధర్ కాంగ్రెస్‌లో చేరారు.



కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

స్టడీ మెటీరియల్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని బీసీ అభ్యర్థులకు టీచర్స్ (ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్) రిక్రూట్మెంట్ 2024 (పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న 10,000 మంది బీసీ (ఎ,బి,డి) అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ ఖర్చును అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన బీసీ అభ్యర్థులు ఆన్ లైన్‌లో www.tsbcstudycircle.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా నేటి నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్, ఎస్జీటీలకు సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్నీ వివరాలకు 040-24071178, 040-27077929 సంప్రదించాలని సూచించారు.

6 గ్రామాల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమస్యలపై సీఎంకు వినతి



సమస్యలు వివరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వెల్గటూర్

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాలైన 6 గ్రామాల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమస్యలపై చాలా ఏండ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక నాయకులు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లురి లక్ష్మణ్ కుమార్ కోరగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వారి సమస్యలను వివరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ..6 గ్రామాల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీల అమలులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ జాప్యం వలన ముంపు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అదే విధంగా సాగు నీటి ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలందర్‌రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ గోపాల్‌రెడ్డి, చెగ్యం ఎంపీటీసీ రంగు తిరుపతి, పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ



ప్యాడు లు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మండలంలోని వర్షకొండ గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తన సొంత డబ్బులతో ఎంపీటీసీ మండల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకట్ పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఫైనల్ ఎగ్జామ్‌లో విజయం సాధించాలని 10/10 జీపీఏ సాధించాలని కోరారు. అనంతరం 22 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌తో కలిసి ఎంపీటీసీ హాల్ టికెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ



: భూమి పూజ చేస్తున్న శ్రీనివాస్

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని వేంపల్లి గ్రామంలో పురాతన శివాల శివాలయం వద్ద నూతనంగా నిర్మించనున్న కళ్యాణ మండపానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల నుంచి రూ.4 లక్షలు కేటాయించగా బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ అరవింద్ నిధులతో మండలానికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి ఎంపీటీసీ, బీజేపీ మల్లాపూర్ మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడు గుగ్లావత్ భూమి రాజేందర్, వేంపల్లి మాజీ సర్పంచ్ బిట్ల సరోజ నరేష్, వేంపల్లి మాజీ ఉపసర్పంచ్ చందనగిరి తిరుపతి, పూజ, బీజేపీ నాయకులు గోపీనేని రాజేందర్, వేల్పుల రాజు, ఆకుల సతీష్, వేముల నరేష్, వెల్మల రాజశేఖర్, మిట్టపల్లి దివాకర్‌రెడ్డి, గుగ్లావత్ శ్రీహరి, గణేష్, నాలిమేలా ప్రసాద్, గుగ్లావత్ అరవింద్ శివాలయ నిర్మాణం కమిటీ సభ్యులు నానం రాజారెడ్డి, గుగ్లవత్ శేఖర్, కల్లెడ గంగాధర్, సభ్యులు పోతు శేఖర్, వేల్పుల రవి, తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను సన్మానించిన నాయకులు



సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

అఖిల భారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఎన్నికైన రెబ్బటి రాజశేఖర్ యాదవ్‌ను శుక్రవారం పలువురు నాయకులు సన్మానించారు. పార్టీలకు అతీతంగా మండల కేంద్రంలోని నాయకులు అభినందలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, నేమూరి సత్యనారాయణ, ఎంపీటీసీ తిమ్మని రాములు, రెబ్బటి రాజేందర్ యాదవ్, సొల్లు ముత్యంరెడ్డి, ముక్కెర మల్లయ్య, కోడిమ్యాల దీపక్, వెంకట్ రెడ్డి, నల్లూరి సాగర్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది రావొద్దు..



నవతెలంగాణ - చందుర్తి

వేసవిలో తాగునీటికి ఇబ్బంది ఉండకూడదని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి అన్నారు. శుక్రవారం మర్రిగడ్డ గ్రామంలో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. తాగునీటి సమస్య ఉంటే త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆమె వెంట ఏపీవో, సెక్రెటరీ ఉన్నారు.

ఉపాధి సరే.. వసతులేవి?



పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు

నవతెలంగాణ - వీర్నపల్లి

ఉపాధి హామీ పథకంలో భాగంగా పని ప్రదేశంలో సరైన వసతులు లేకపోవడంతో కూలీలు అనేక ఇబ్బందులూ ఎదుర్కొంటున్నారు. వడ దెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. వేసవిలో మార్చి నుంచి జూన్ రెండో వారం వరకు కూలీలకు సరైన వసతులు కల్పించాలి. వడదెబ్బ తగలకుండా గుడారాలు వేసి రక్షణ ఏర్పాటు చేయాలి. మండల వ్యాప్తంగా ఉపాధి కూలీ సౌకర్యాలు అంతంత మాత్రాంగానే ఉంటున్నాయి. సరైన వసతులు లేక వారు ఎండలోనే సేద తీరుతున్నారు. వేసవిలో కల్పించాల్సిన వసతులపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు.

కానరాని గుడారాలు మెడికల్ కిట్లు

మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 4319మొత్తం జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో పనికి వచ్చే కూలీలు ఒక్క గ్రామానికి దాదాపు 70-100పైగా వస్తున్నారు. మండలం మొత్తం 1500వరకు ప్రస్తుతం కూలీలు పనులకు వస్తున్నారు. వారు భోజనం చేయడానికి, అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడారాలు పంపిణీ చేసేది ఏడేళ్ల నుంచి పంపిణీ నిలిపివేసింది. ఈ ఏడాదైనా సమకూరిస్తే సౌకర్యంగా ఉంటుందని కూలీలు పేర్కొంటున్నారు. 2015-16 నుంచి మెడికల్ కిట్లు పంపిణీ మరిచారు. కూలీలకు చిన్న చిన్న గాయాలైనప్పుడు ప్రథమ చికిత్స చేయడానికి వీటిని ఉపయోగించేవారు. ఈ కిట్‌లో అయోడిన్ సీసా, బ్యాండేజ్, దూది ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొన్ని రకాల మాత్రలు ఉండేవి. గతంలో కూలీలకు గడ్డ పార, పార, తట్టలను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం వాటి ఊసే లేదు దీంతో కూలీలే సొంతంగా పరికరాలను సమకూర్చుకుంటున్నారు.

కనీస వసతులు కరువే..

ఉపాధి హామీ పనులు చేపడుతున్న ప్రదేశంలో గుడారాలతో పాటు తాగునీరు ప్రథమ చికిత్స అందుబాటులో ఉంచేవారు. కనీస వసతులు కురువైనా ఇంతవరకు వాటిని ఏర్పాటు చేయలేదు. తాగునీటి వసతి లేకపోవడంతో ఉదయం వారి వెంట తెచ్చుకున్న మంచి నీటి సిసాలే గతవుతున్నాయి. అవి పూర్తి కాగానే నీకోసం కూలీలు అల్లాడుతున్నారు.

సక్రమంగా అందని వేతనాలు

ఉపాధి పనులు చేసిన కూళీలకు సక్రమంగా బిల్లులు కూడా అందరం లేదు. 15 రోజులు ఒక్కసారి బిల్లులు అందాల్సి ఉండగా నాలుగు అయిదు వారాలు దాటినా వేతనాలు జమ కావడం లేదు. దీంతో పనులకు రావాలంటే కూలీలు వెనుకంజ వేస్తున్నారు.

కులీలకు ఇబ్బందులకు లేకుండా చూస్తాం : ఏపీవో శ్రీహరి

వారం వారం డబ్బులు కూలీలకు అందేలా చూస్తాం. నీటి ఏర్పాటు కు గ్రామ పంచాయతీలకు తెలిపి అందిస్తాం. పీహెచ్‌సీ నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు తీసుకొచ్చి అందుబాటులో ఉండాలా చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తాం.



అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహిస్తున్న జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

జెడ్పీటీసీ పూర్మాని మంజుల

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

గ్రామాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి కేటాయించిన ఎస్డిఎఫ్ నిధుల నుండి తంగళ్ళపల్లి మండలంలో పలు గ్రామాల్లో జెడ్పిటిసి పూర్మాని మంజుల లింగారెడ్డి శుక్రవారం అభివృద్ధి పనులకు భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారు. మండపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో త్రాగునీటి ఎద్దడి తీర్చేందుకు కమ్యూనిటీ భవనం వద్ద బోరు మోటర్ ను ప్రారంభించారు. నేరెళ్ళ, జిల్లెల్ల, నరసింహుల పల్లె గ్రామల్లో బోరు మోటార్లను ప్రారంభించారు. రామచంద్రపురం గ్రామంలో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి, హైమాస్ లైట్లు ఏర్పాటుకు, నరసింహులపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలి..
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆర్డీవో
- ఆర్డీవో లోలావార్ రమేష్



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ, ఎంఆర్ఓ

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని,పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆర్డీవో లోలావార్ రమేష్ అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డిఓ లోలావార్ రమేష్, తహసిల్దార్ వెంకటలక్ష్మి తో కలిసి సందర్శించారు. ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుంటే వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఆర్ఐ మధు ఉన్నారు.

విద్యార్థులు శ్రద్ధతో పరీక్షలు రాయాలి



నవతెలంగాణ - చందుర్తి :

విద్యార్థులు శ్రద్ధతో పరీక్షలు రాయాలని మండల కో ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అబ్రహం, మాజీ ఏఎంసీ చైర్మెన్ శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

నేతన్నలకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలి

- తక్షణ సాయంగా రూ.10వేలు అందించాలి
- పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకుల డిమాండ్
- నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేసిన సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమంప చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ లో నెలకొన్న సంక్షోభాన్ని నివారించి నేతన్నలకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని సీఐటీయు పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమలో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి పవర్లుమ్ అనుబంధ రంగాల కార్మికులకు వెంటనే ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో సీఐటీయూ పవర్లుమ్, అనుబంధ రంగాల యూనియన్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన 24 గంటల నిరాహార దీక్షను శుక్రవారం విరమణ చేశారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మిట్టపెల్లి రాజమల్లు, రాపెల్లి రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డిలు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. అనంతరం మూశం రమేష్, కోడం రమణ, మిట్టపల్లి రాజమల్లు మాట్లాడుతూ సిరిసిల్లాలో మూడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో నేతన్నలకు ఉపాధి లేక పస్తులు ఉంటున్నా రన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సిరిసిల్లలో నేతన్నల ఆకలి చావులు ఆత్మహత్యలు మళ్లీ పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉపాధి కోల్పోయిన నేతన్నలందరికీ తక్షణ సాయంగా ప్రతి కార్మికునికి రూ.10 వేలు అందించాలన్నారు. అదేవిధంగా కార్మికులకు రావలసిన 2022 - 23 సంవత్సరాల బతుకమ్మ చీరల 10శాతం యారన్ సబ్సిడీ డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డి నేతన్నల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోర అజయ్, అన్నల్దాస్ గణేష్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరి కుంట కిషన్, ఆడెపు సంపత్, గుండు రమేష్, మోర తిరుపతి, కంది మల్లేశం, రామచంద్రం, రాము, సీఐటీయూ పవర్‌లూం, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీల దశాబ్దాల డిమాండ్స్ నెరవేర్చిన కాంగ్రెస్

- బీసీలకు తొమ్మిది కార్పొరేషన్స్ ఏర్పాటు సంచలన నిర్ణయం
- బీసీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలి
- కార్పొరేషన్స్ ఏర్పాటు పట్ల సర్వత్రా హర్షం
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి హనుమాను

నవతెలంగాణ - సిరిసిల్ల

బీసీ కులగణన,బీసీ కులాలకు 9 కార్పొరేషన్స్ ఏర్పాటు చేసి బీసీల దశాబ్దాల డిమాండ్స్ నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతున్నదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు, శుక్రవారం జిల్లా కేంద్రం లోని బీసీ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది, ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు హాజరై మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టాలని బీసీ కార్పొరేషన్స్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం ఓ చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. బీసీ కార్పొరేషన్స్ ఏర్పాటు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నదని బీసీ సంక్షేమ సంఘం గా ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం శాతం రిజర్వేషన్స్ కల్పించాలని పర్శ హన్మాండ్లు ప్రభుత్వాన్ని కోరారు. బీసీకార్పొరేషన్స్ ఏర్పాటుకు కృషిచేసిన సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తడుక కమలాకర్, సామల రాజు గౌడ్, ఇల్లంతకుంట తిరుపతి, శ్రీనివాస్,శ్రీకాంత్,తిరుపతి ,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం



నవతెలంగాణ - కొనరావుపేట

మరిమడ్ల గ్రామ అభివృద్ధి లక్ష్యమని ఎంపీటీసీ కోనేరు రేణుక అన్నారు. శుక్రవారం మండలంలోని మరిమడ్ల గ్రామంలో ఎంపీ నిధులు రూ.12లక్షలతో సీసీ రోడ్డు, రూ.3లక్షలతో కుల సంఘ భవనాలకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇస్తారు ప్రవీణ్, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, భాజపా జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ - గంభీరావుపేట

దొంగతనాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంభీరావుపేట ఎస్సై రాంమోహన్ అన్నారు. శుక్రవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాం మోహన్ మాట్లాడుతూ మండల పరిధిలో కొద్ది రోజులుగా వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలకు పలు సూచనలు చేశారు. అత్యవసర పనులు, శుభకార్యాలకు వేళ్లేవారు ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు గ్రామ పోలీస్ అధికారులకు, పోలీస్ స్టేషన్లో ఫోన్ సమాచారం అందించాలన్నారు. ఇంటిలో విలువైన (బంగారం, వెండి)వస్తువులు పెట్టరాదని, బ్యాంక్‌లో భద్ర పరుచుకోవాలని సూచించారు.

నవతెలంగాణ - వీర్నపల్లి

దొంగతనలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ తెలిపారు. వీర్నపల్లి మండల అన్ని గ్రామాల ప్రజలకు పోలీసులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొద్ది రోజులుగా సరిహద్దు మండలాల్లోని పలు గ్రామాలల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నందున ఎవరైనా అత్యవసర పనులకు, శుభకార్యాలకు వెళ్లేవారు ఇంటికి తాళం వేసి వెళ్ళేటప్పుడు మీ గ్రామ పోలీసులకుగాని పోలీస్ స్టేషన్‌లో వివరాలు సెల్ నెంబర్లు ఇచ్చి వెళ్లాలని సూచించారు. విలువైన బంగారం, వెండి, డబ్బులు ఇంటిలో పెట్టి వెళ్లకుండా బ్యాంకుల్లో భద్రపరచుకోవాలన్నారు. ఎవరైనా ఇతర రాష్ట్రాలకు చెందినవారు ద్విచక్రవాహనాలపై నిత్యావసర సరుకులు అమ్ముతూ అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు 100 సమాచారం ఇవ్వాలని, లేదా తన నెంబర్ 8712656376కూ కూడా నేరుగా తెలపవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ - గంభీరావుపేట

మండలంలోని దోసలగూడెంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో కాలనీ వాసులు నిరసనకు దిగగా.. కాంగ్రెస్ మద్దతు తెలిపిందని గుర్తుచేశారు. నాడు ఇచ్చిన మాట ప్రకారం తాము ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.5లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుహమీద్, తెలంగాణ మాల మహనాడు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాపాగారి రాజాగౌడ్, గంభీరావుపేట మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్, ముచ్చర్ల మాజీ ఉప సర్పెంచు రాఘవేందర్ రెడ్డి, ఎంపీటీసీ పర్శరాములు, చంద్రారెడ్డి, లచ్చయ్య, రాజిరెడ్డి, ఓరుగంటి నర్సింలు, మెడ భాస్కర్, ఎర్ర నరసయ్య, ఉస్ర్రతుల్లా, పంతం సురేష్, అజ్మీరా భాస్కర్, లచ్చయ్య, కోట భూమయ్య పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కొనరావుపేట

పోషణ అభియాన్‌లో భాగంగా మండలంలోని శివంగలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంను ఐసీడీఎస్ సూపర్వైజర్ గంగ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులు ఎలాంటి ఆహారం తీసుకోవడం ఆకుకూరలు కూరగాయలు పప్పులు, పాలు గుడ్లు క్యారెట్ బీట్రూట్ మొదలైన ఆహారం, మిల్లెట్స్ ఫుడ్ అయిన కొర్రలు, అరికెలు, సాములు, ఊదలు, అండ్ కొర్రలు, రాగులు మొదలైన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

హైమాస్ లైట్ ఏర్పాటుకు భూమి పూజ



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండల కేంద్రంలోని గుండారం గ్రామంలో శుక్రవారం పైప్ లైన్ హైమాస్ లైట్‌కు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ గుండారం గ్రామానికి నిధులు మంజూరు చేసిన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డికి గ్రామస్తుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. అలాగే గుండారం గ్రామంలో కాంగ్రెస్‌కి మంచి పట్టు ఉందని ఎప్పుడైనా గుండారం గ్రామంలో ఇతర రాజకీయ పార్టీల కంటే ఓట్ల శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. రాబోయే రోజులలో గుండారం గామానికి అధిక నిధులు ఇచ్చి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యాక్రమంలో రాచర్ల తిమ్మాపూర్ ఎంపిటిసి బాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజేందర్, చేపూరి రాజేశం నేలపల్లి శ్రీనివాస్, జజ్జరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మల్లయ్య డాక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి ,షాది ముబారక్‌ల చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-జూలపల్లి /ఎలిగేడు

ఎలిగేడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎలిగేడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణారావు శుక్రవారం రోజున పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డకు కళ్యాణ లక్ష్మి ఎంతో వరం అని అన్నారు. అలాగే మండలం కు బస్సు సౌకర్యం ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్ రావు, గోపు విజయభాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయకులు

తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి విద్యార్థి చైతన్యపర్చాలి

నవతెలంగాణ-గోదావరిఖని:

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి విద్యార్థి చైతన్య పరచాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ కోరారు. ఎన్నికల కమీషన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అశోక్ నగర్‌లోని జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకుంటానని ప్రతిజ్ఞ చేయడానికి ఉద్దేశించిన సంకల్ప పత్రాలు తమ తల్లితండ్రుల సంతకాలతో ప్రతి విద్యార్థి తీసుకురావాలని అన్నారు.


మాట్లాడుతున్న నగర కమిషనర్

కాన్షీరాం జయంతి వేడుకలు

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి పట్టణంలో స్థానిక జండా చౌరస్తా దగ్గర కాన్షీరాం 90వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ కేఎల్ భాహుజన్ అనిత, నార్ల గోపాల్ యాదవ్, అముదాల అరుణ, రామిల్ల శారద, ఓం ప్రకాష్, పాల్గొన్నారు.



గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల 5వ రోజు ప్రత్యేక శిబిరం

నవతెలంగాణ-పెద్దపల్లి

స్థానిక గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని 5వ రోజు మారేడు గొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్‌కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.మనోహర్ మాట్లాడుతూ ఓటు హక్కుపై ప్రజలలో అవగాహన కల్పించడం కోసం విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు తెలిపారు. కులం, మతం, ప్రాంతం భేదం లేకుండా ఓటు వేయాలని సూచించారు. గాయత్రీ విద్యాసంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉంటుందని, విద్యార్థులు తమ ఓటు హక్కును సరైన విధంగా వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంఏ సమద్, అధ్యాపకులు సదానందం, ఆమని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



తానిపర్తి చికితను అభినందించిన విజయరమణరావు

నవతెలంగాణ-జూలపల్లి/ ఎలిగేడు

ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఆర్చరీలో రాణించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం మహిళా విశిష్ట పురస్కారాన్ని అందించారు. రాష్ట్ర మహిళా పురస్కారాన్ని అందుకున్న చికిత ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామణారావు శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్రవంతి, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచులు వెంకటేశ్వరరావు, సింధుజ, నాయకులు పాల్గొన్నారు.


చికితను సన్మానిస్తున్న నాయకులు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలంలోని కుమ్మరి కుంట గ్రామంలో శుక్రవారం రోజున పశు వైద్యాధికారి డాక్టర్ అజారుద్దీన్ ఆదేశాలు మేరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అందులో గేదెలు103, ఆవులు60కి గాలికుంటు టీకాలు అందించామని డాక్టర్ అజారుద్దీన్ తెలిపారు. మూగజీవాల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ వేణుగోపాల్,గోపాలమిత్ర మంద మల్లేశం గ్రామ రైతులు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

గుండేటి ఐలయ్య యాదవ్

నవతెలంగాణ-ఓదెల:

రాష్ట్ర ప్రభుత్వం యాదవ,కురుమ సమస్యలు పరిష్కారం కోసం యాదవ,కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయం అని యాదవ సంఘం రాష్ట్ర నాయకులు గుండేటి ఐలయ్య యాదవ్ అన్నారు.గత కొన్ని సంవత్సరా లుగా యాదవ కార్పొరేషన్ ఏర్పాటు కోసం యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్న వించామని, గత పాలకులు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు.యాదవ కార్పొరేషన్ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జీలుక సంతోష్ యాదవ్, గుండేటి సారయ్య, అముల్ల శంకర్, గుండేటి మల్లయ్య, ఈద రాజయ్య యాదవ్, బీనవేన చేరలు, గుండేటి కొమురయ్య, ఈద మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరి స్వామి

నవ తెలంగాణ-రామగిరి

గోదావరిఖని లేబర్ కార్యాలయం లేబర్ ఆఫీసర్‌పై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. రామగిరి మండల భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో శుక్రవారం నాడు గ్రామ అధ్యక్షుడు ఎస్కే షరీఫ్, జనరల్ సెక్రెటరీ కుసుమ సురేష్ ఏర్పాటుచేసిన సమావేశంలో స్వామి హాజరై మాట్లాడారు. లేబర్ కార్యాలయంపై కొంతమంది పని కట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి ఆరోపణలు మానుకోవాలన్నారు. అలాగే ఇప్పుడున్న లేబర్ అధికారి సకాలంలో మా కార్మికులకు లేబర్ కార్డు క్లెయిమ్స్ రూ పాయి ఆశించకుండా సకాలంలో అందిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఇంతకు ముందున్న అధికారి ఆఫీస్‌కి వెళ్లిన పనులు జరిగేవి కావని, ఇప్పుడున్న అధికారి ఒక ఫోన్ కాల్ తోనే స్పందిస్తూ కార్మికుల సమస్యలను తెలుసుకుని వాటిని త్వరగా పరిష్కరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ బైరి శంకర్, జిల్లా కార్యదర్శి కుమ్మం లక్ష్మీనారాయణ, వెంగళ రాములు, కొయ్యడ సంపత్ ,గాదె సారయ్య, పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రోజున దుద్దిళ్ల శ్రీపాద రావు జ్ఞాపకార్థంగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి అతిక్ పాషా ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఎండలో వచ్చిన వారి దాహాన్ని తీర్చడం సంతృప్తికరమని అతిక్ అన్నారు. ఈ కార్యక్రమంలో దికొండ రమేష్,ఎండీ సమీర్, ఎండీ ఫజల్, కైలాసం శ్రావణ్ కుమార్, గంగిపల్లి మొండి, ఎండీ సాజిద్, ఎండీ. యూసుఫ్,ఎండీ సలీం, ఉపేంద్ర చారి, పాశం నరేష్, పిట్టల చిన్న లచ్చయ్య బద్రి తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వినియోగదారులకు బాధ్యతలు తెలియాలి

▸ అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

నవతెలంగాణ-పెద్దపల్లి

వినియోగదారులు తమ హక్కులతో పాటు బాధ్యతలను తెలిసి ఉండాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో నూతనంగా ఏర్పడిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లాభాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయని, ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన కలిగి ఉండి సమర్థవంతంగా, జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా బ్యాంకు, వ్యక్తిగత వివరాలను, ఓటీపీలను ఎవరికి షేర్ చేయకూడదని, ఇలా చేయడం వల్ల ప్రస్తుత కాలంలో సైబర్ క్రైమ్, మోసపూరితమైన చర్యలు, కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయని అన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువు యొక్క నాణ్యతను పరిశీలించాలని, ప్రకటనలకు ఆకర్షితులై మోసపోకూడదని, తప్పనిసరిగా సరైన బిల్లు తీసుకోవాలని, జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంస్థ రూపొందించిన కరపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీవైఎస్ఓ సురేష్, ఆర్టీవోరంగారావు, పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

ఘనంగా కాన్షీరాం 90వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుజన సిద్ధాంతకర్త కాన్షీరాం 90వ జయంతి వేడుకలను గోదావరిఖనిలోని తెలంగాణ అంబేద్కర్ ట్రస్ట్ భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ కన్వీనర్ బూడిద మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్యలు హాజరై ఈ సందర్భంగా కాన్షిరాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ భారతదేశ రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్న కాన్షిరాం ఈ దేశ జనాభాలో మెజార్టీగా ఉన్న బహుజనలకు రాజ్యాధికారం కావాలని కలలు గన్న మహోన్నతులన్నారు. ఓటు హమారా రాజ్ తుమారా నహి చలేగా నహి చలేగా అంటూ దేశంలోని బహుజన దళిత వర్గాలకు రాజ్యాధికారం కోసం తుది శ్వాస వరకు పోరాడిన యోధుడు కాన్షిరాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ శనిగరపు రామస్వామి, జిల్లా కో కన్వీనర్లు దుబాసి బొందయ్య, తదితరులున్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

జీడీకే-1 ఇంక్లైన్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

▸ గని మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ-1ఏరియాలోని జీడీకే-1 ఇంక్లైన్ కార్మికులు వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్నారని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం గని మేనేజర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొనడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ తెలిపారు. ముఖ్యంగా 1 ఇంక్లైన్‌లో కార్మికులు గనిలో సర్ఫేస్ వరకు మ్యాన్ రైడింగ్ లేకపోవడంతో గని పైకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, కనుక సర్ఫేస్ మ్యాన్ రైడింగ్ ఏర్పాటు చేయాలని, గనిలో ప్రస్తుతం ఉన్న ఎస్‌డీఎల్ యంత్రాలు పూర్తిగా చెడిపోయి ఉత్పత్తికి ఆటంకం ఏర్పడి కార్మికులు వాటిని నడపడానికి ఇబ్బందులు పడుతున్నారని, కనుక వాటిని తొలగించి కొత్త ఎస్‌డీఎల్‌లను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న సైకిల్ షెడ్ సరిపోవడం లేదని, కనుక అదనంగా షెడ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ-1బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, ఫిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు సిర్ర మల్లికార్జున్, సంపత్ రావు, తదితరులున్నారు.


మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఏఏ గెజిట్ విడుదల

పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి

నవతెలంగాణ-గోదావరిఖని:

ప్రజల దృష్టి మళ్లించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన సీఏఏ గెజిట్ విడుదల చేసిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా అనుబంధ ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి అన్నారు. పీవోడబ్ల్యూ ముఖ్య కార్యకర్తల సమావేశం గోదావరిఖనిలో శుక్రవారం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 పార్లమెంటరీ ఎన్నికలకు కొద్ది వారాల ముందు, సీఏఏ 2019 కోసం నిబంధనల నోటిఫికే షన్‌ను విడుదల చేయటాన్ని సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ అనుబంధ ప్రగతిశీల మహిళా సంఘం నిస్సందేహంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. మత ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడానికి నిబంధనలను రూపొందించడం ద్వారా ప్రజలను మతపరంగా విడగొట్టడం, భారత రాజ్యాంగంలోని ప్రాద ?మిక సూత్రాలను బలహీనపరచడం మోడీ ప్రభుత్వం యొక్క తక్షణ లక్ష్యమని ఆరోపించారు. సమావేశంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకులు రమాదేవి, మార్త రాధ, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, తదితరులున్నారు.



వికల్ప- 24 కామర్స్ మీట్ బహుమతులు గెలుచుకున్న పీజీ విద్యార్థులు

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎం.కామ్ విద్యార్థులు డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ శాతవాహన యూనివర్సిటీ వారు నిర్వహించిన వికల్ప- 24 కామర్స్ మీట్ కార్యక్రమంలో వివిధ విభాగాలలో బహుమతులు గెలుచుకున్నారు. బిజినెస్ క్విజ్ విభాగంలో స్వాతిక, రుమీజా,అనిత, సోనీ మొదటి బహుమతి,ని వాణిజ్య ప్రకటన తయారీ విభాగంలో అఖిల, అనూష, మహేష్, సోనీ బందం మొద టి బహుమతిని, సోలో డాన్స్ విభాగంలో బండారి అర్చన మొదటి బహుమతిని, వక్తృ పోటీ విభాగంలో బి.అనిత ద్వితీయ బహుమతిని, పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో కే.స్వాతి, కే.శ్రావణి తతీయ బహుమతిని గెలుచుకున్నారు.వికల్ప- 24లో అత్యంత ప్రతిష్టాత్మకమైన శాతవాహన వీర టైటిల్ని రుమీజా గెలుచుకున్నారు. వివిధ అంశా లలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు వికల్ప -24 కన్వీనర్ డాక్టర్ డి.హరి కాంత్, శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అర్చన చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.



ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-గోదావరిఖని:

ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరిచే పరికిపండ్ల సత్యనారాయణ సంస్మరణార్థం బసంతనగర్‌లోని నిర్మించిన ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రిలో శుక్రవారం కంటి శస్త్ర చికిత్స కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా విశేష స్పందన లభించింది. 150 మందికి పైగా కంటి పరీక్ష కోసం రాగా వారికి హైదరాబాద్ నుండి ప్రత్యేక డాక్టర్స్ బృందంతో అత్యాధునిక సాంకేతిక పరికరాలతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 100 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరం ఉందని గుర్తించారు. ఈ 100 మందిలో 60 మందిని శస్త్ర చికిత్స కోసం హైదరాబాద్‌లోని శంకర విజన్ సెంటర్‌కి తరలించి ఉచితంగా శస్త్ర చికిత్స చేశారు. శస్త్ర చికిత్స కోసం అధిక సంఖ్యలో ఆసుపత్రికి వస్తున్నారని, కనుక ఈ నెల 16న కూడా క్యాంప్ నిర్వహిస్తామని, కంటి సమస్యతో బాధపడుతున్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి బాధ్యులు పరికిపండ్ల రాము తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఇన్‌చార్జీ పరికిపండ్ల రాము, ఆలయ-శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది, ఆలయ ఫౌండేషన్ వాలంటీర్స్ మిట్టపల్లి రాజేందర్, కీర్తి నాగార్జున, కన్నం తిరుపతి, కన్నం వెంకటేష్, తదితరులున్నారు.



మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలకమండలి ఎన్నికలు

ఎన్నికల అధికారి బి.రామ్మోహన్

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ యొక్క పాలకమండలి ఎన్నికలను మార్చి 23న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.రామ్మోహన్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ, హైదరాబాద్ సూచన మేరకు మార్చి 23న రహస్య బ్యాలెట్ పద్ధతిన జిల్లా మత్స్య పారిశ్రామిక శాఖ సంఘం లిమిటెడ్ యొక్క పాలకమండలి ఎన్నికలను నిర్వహించుటకు తనను ఎన్నికల అధికారిగా నియమించినట్లు జిల్లా సహకార అధికారి కార్యాలయ డిప్యూటీ రిజిస్టర్, ఆడిట్ అధికారి బి.రామ్మోహన్ తెలిపారు. మార్చి 23న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఈ ఎన్నికలో మొత్తం 11 జనరల్ క్యాటగిరి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నట్లు తెలిపారు. మొత్తం స్థానాలకు మించి అర్హమైన నామినేషన్లు దాఖలు కానీ సందర్భంలో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల పేర్లు మార్చి 19న ప్రకటించడం జరుగుతుందని, పోటీ ఉన్నప్పుడు మార్చి 23న నందన గార్డెన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించి, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేసి అదే రోజు ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని ఎన్నికల అధికారి బి.రామ్మోహన్ తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ గడ్డం వంశీకృష్ణకు ఇవ్వాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వునుకొండ శ్రీధర్ పటేల్

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకే టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వునుకొండ శ్రీధర్ పటేల్ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం స్థానిక ఎంబీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాకా వెంకటస్వామి కుటుంబంతో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. విశాఖ ట్రస్టు ద్వారా ఎన్నో ప్రజాహిత సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని అన్నారు.కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న వంశీకృష్ణను భారీ మెజారి టీతో గెలిపిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు సజ్జాద్, బాలసాని సతీష్ గౌడ్, ఉనుకొండ భూమయ్య, వైకుంఠం, అడ్డగుంట శ్రీనివాస్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీధర్ పటేల్

ప్లాస్టిక్‌ను నివారించకపోతే మనుగడ ప్రశ్నార్థకం

▸ డీఈవో డి.మాధవి

నవతెలంగాణ-పెద్దపల్లి

ప్లాస్టిక్ (సింగిల్ యూజ్ ప్లాస్టిక్)ను సాధ్యమైనంత వరకు నివారించకపోతే భవిష్యత్తులో మానవ మనుగడే ప్రశ్నార్థక మవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ, నేషనల్ గ్రీన్‌కోర్ ఎన్‌జీసీ (జాతీయహరితదళం) ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నాటిక (డ్రామా), ఏకపాత్రా భినయం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గతంలో బట్ట సంచులు, స్టీల్, రాగి డబ్బాలు, మట్టి పాత్రలు వాడేవారని అప్పటి వారంతా ఆరోగ్యంగా ఉండి జీవితాన్ని ఆనందంగా గడిపారని, ఆ పరిస్థితులు తిరిగి రావాలన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ కారణంగా చిన్నపిల్లలు మొదలు పెద్దవారి వరకు ఎన్నో రుగ్మతలకు లోనవుతున్నారని, పర్యావరణం కాలుష్యంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పిఎం షేక్, ఎన్జీసీ జాతీయ హరిత దళం స్టేట్ ప్రాజెక్టు అధికారి బి.విద్యాసాగర్, జిల్లా జాతీయ హరిత దళం సమన్వయ అధికారి గూళ్ల అంజన్ కుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో

పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ వితరణ

నవతెలంగాణ-గోదావరిఖని:

చైతన్య మానవ వేదిక స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షుడు కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరిఖని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, స్టేషనరిని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి నూతి సురేష్ కుమార్, ఉపాధ్యక్షులు మాదాసు శ్రీనివాస్, పాల్గొన్నారు.



అత్యధిక ఎంపీ స్థానాలు కాంగ్రెస్‌వే...

నవతెలంగాణ-గోదావరిఖని:

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన చేస్తూ నేటికీ 100రోజులు విజయవంతంగా పూర్తి చేసి, కాంగ్రెస్ పార్టీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలువబోతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుతారి లక్ష్మణ్ బాబు ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గం సమర్థ వంతంగా పనిచేస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎన్నికల హామీలు అరు గ్యారంటీ పథకాలలో 5 పథకాలు అమలు చేశామన్నారు.



వడ్డీ మాఫీపై విస్తృత ప్రచారం చేయాలి

నవతెలంగాణ-గోదావరిఖని:

ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ పొందే అవకాశం ఎక్కువ మంది ఉపయోగించేకునేలా విస్తత ప్రచారం చేయాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీ కాంత్ మున్సిపల్ సిబ్బందిని కోరారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సమావేశాల్లోనూ ఈ విషయాన్ని వివరించి ఆస్తి పన్ను వసూళ్లు మెరుగుపడడానికి సహకరించా లని మెప్మా సిబ్బందిని కోరారు. ప్రజాపాలన ధరఖాస్తుదారుల సందేహా లను నివృత్తి చేసి ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను నమోదు చేసి అర్హులకు విద్యుత్ జీరో బిల్లు అమలుకావడానికి సిబ్బంది సహకరించాలని అన్నారు. అలాగే గ్యాస్ సబ్సిడీ పొందడానికి ఈ కేవైసీ చేయించుకొని ఉండాలని తెలియజేయాలని అన్నారు. ఏప్రిల్ 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబ కేశ్వర్ రావు, ఎస్ఇ చిన్నారావు, సెక్రెటరీ రాజు, సూపరింటెండెంట్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నగర కమిషనర్

షరతులు వర్తిస్తాయి సినిమా రిలీజ్ వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని ఊర్వశి టాకీస్‌లో షరతులు వర్తిస్తాయి సినిమా రిలీజ్ సందర్భంగా ఎక్సక్యూటివ్ ప్రొడ్యూసర్ సంపత్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, పిట్టల మధు, సుధాకర్, దర్శకుడు అక్షర్ కుమార్ మిత్రులు వేడుకలను నిర్వహించారు. ఈ సినిమాకు గోదావరిఖని వాస్తవ్యుడు ఆసరి కుమారస్వామి దర్శకత్వం వహించగా, అక్షర కుమార్ చిత్రాన్ని నిర్మించారు. ఎక్స్‌క్యూటివ్ ప్రొడ్యూసర్ భీమరి సంపత్ వ్యవహరించారు. పూర్తిగా తెలంగాణ సంస్కృతి, భాష యాసతో కూడిన సినిమాలో చైతన్య రావు, భూమిక శెట్టి హీరో హీరోయిన్లుగా పరిచయం అయ్యారు. దర్శకుడిగా దీవించడానికి అతిథిగా అన్ని తానై తనయుడి విజయాల కోసం ప్రతి క్షణం తన కొడుకు అక్షర కుమారునికి అందరి ఆశీర్వాదాలు ఉండాలని మనస్ఫూర్తిగా వారి చేతుల మీదుగా సినిమా కేక్‌ను అమ్మ లచ్చవ్వ చేతుల మీదుగా కట్ చేయించారు.


సినిమా విడుదల సందర్భంగా వేడుకలు

తైబజార్ వేలం

నవ తెలంగాణ సుల్తానాబాద్

శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు ఆధ్వర్యంలో తై బజార్ వేలంపాటను నిర్వహించారు. మున్సిపల్ తై బజార్(2024-25) సంవత్సరం వేలం పాట 13 లక్షల రూపాయలకు పొన్నం శ్రీనివాస్‌కు దక్కిందని కమిషనర్ కట్ల వేణుమాధవ్ తెలిపారు. వేలంపాటకు హాజరైన ముగ్గురు వ్యక్తులు పాల్గొనగా సర్కారు పాటకు అదనంగా 13 లక్షల రూపాయలకు పొన్నం శ్రీనివాస్ పాడి దక్కించుకున్నారు. వేలంపాటలో వైస్ చైర్మన్ బిరుదు సమత కృష్ణతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు



గ్రంధాలయాన్ని గ్రామ యువకులు సద్వినియోగం చేసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

నవతెలంగాణ- సుల్తానాబాద్ రూరల్

గర్రెపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంధాలయాన్ని అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ, సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీ రావు ప్రారంభించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంధాలయంని గ్రామ యువకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎంపీపీ బాలాజీరావ్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచడమైనది కావున అందరూ సద్వినియోగం చేసుకొని రాబోయే పరీక్షలలో రాణించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, గ్రామ స్పెషల్ ఆఫీసర్ దివ్యదర్శనరావు, ఎంపీటీసీ పులి అనూష ఎంపీవో ఫయాజ్ అలీ, సెక్రటరీ ప్రశాంత్, గ్రామంలోని యువత పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణ

బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముత్తారం:

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం మంథని నుంచి హైదరాబాద్‌కు రాజధాని ఎసీ బస్సు సేవలను ప్రారంభించడం జరిగిందని మంథని ఆర్టీసీ డిపో మెనేజర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు రాత్రి 11గంటల సమయంలో మంథని నుంచి హైదరాబాద్ మీదుగా దిల్‌సుఖ్ నగర్‌కు బయలుదేరుతుందని, దిల్‌సుఖ్‌నగర్ వరకు 620 రూపాయలు, హైదరాబాద్ వరకు 600 రూపాయలు, జేబీఎస్ వరకు 570 రూపాయల టికెట్ ధరలను నిర్ణయించడం జరిగిందని తెలిపారు.



అభివృద్ధి పనులకు 1.40కోట్ల నిధులు మంజూరు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలంలోని వివిధ గ్రామాలకు ఎంఎన్ఆర్‌జీఎస్ నిధుల కింద దాదాపు 1 కోటి 40 లక్షలు రూపాయల నిధులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో మంజూరు అయినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, మండల యువజన సంఘం అధ్యక్షులు బియ్యాని శివకుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు వాజీద్ పాషా, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తూటి రఫీ రజిత, ఎంపీటీసీ దొడ్డ గీతారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com

ఎంఎస్.స్వామినాథన్ స్ఫూర్తిగా వ్యవసాయ రంగంలో ముందుకు పోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

ముగ్ధుంపూర్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ స్ఫూర్తిగా వ్యవసాయ రంగంలో ముందుకు పోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని ముగ్ధుంపూర్‌లో రూ.3కోట్ల బీసీ నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల వ్యవసాయ కళాశాల (బాలికల) భవన నిర్మాణానికి మంత్రి శుక్రవారం డిగ్రీ మానకొండురు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల కార్యదర్శి సైదులుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి వ్యవసాయ కళాశాల విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. సాంకేతిక విప్లవాన్ని వ్యవసాయంలో సృష్టించాలని, నిరుద్యోగులు వ్యవసాయం వైపు చూడల్సి వస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో మరింత రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలతో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మంజూరు చేయించారని, ఈ కార్యక్రమంలో వారు పాల్గొనాల్సి ఉండేదన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తుందని, అభివృద్ధి నిరంతర ప్రక్రియ, వ్యవసాయ కాలేజీలో వినూత్న పద్ధతులు రావాలి, అందరూ సహకరించాలని కోరారు. కాలేజీ దారికి సహకరించాలి, ఆ తరువాతనే పని ప్రారంభించాలని సూచించారు. అగ్రికల్చర్ కాలేజీలో చదివే విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. నాలెడ్జ్ లేకుండా చదివితే లాభం లేదని, ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్ ఉండాలని, వ్యవసాయం మీద అవగాహన ఉండాలి, తక్కువ వాటర్‌తో పండించే పద్ధతులతో వినూత్న వ్యవసాయ మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలని చెప్పారు. సెప్టెంబర్‌లో వర్షాలు రాలేవు, కరువు ఏర్పడింది, దానికి ఎవరు బాధ్యులు కాదన్నారు. కొంతమంది కాంగ్రెస్ కరువు తెచ్చింది అంటున్నారు, అది ఏ పార్టీ వాళ్ల తెచ్చిన కరువు కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ రెవెన్యూ అధికారి మహేశ్వర్, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - చొప్పదండితత



అర్హులైన ప్రతి ఒక్కరికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 27మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజభూమారెడ్డి, ఎంపీటీసీలు కూకట్ల తిరుపతి, తోట కోటేష్ పటేల్, తహసీల్దార్ జక్కని నరేందర్, ఎంపీడీవో ఆర్.వేణుగోపాల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐలు నాగరాజు, త్రిపాల్‌సింగ్, నాయకులు మునిగాల చందు, కట్టెకోల లక్ష్మణ్, మునిగాల సుధాకర్, శ్రీకాంత్, రాజన్నల తిరుపతి పాల్గొన్నారు.

కుడికాల్వ పనులు పూర్తి చేయిస్తా

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - గంగాధర



సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మెట్ట ప్రాంత రైతాంగానికి మేలు చేకూరే విధంగా నారాయణపూర్ కుడి కాల్వ పనులు పూర్తి చేయిస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా నిచ్చారు. గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాల్వ పనులను పూర్తి చేయించి సాగునీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో రూ.1.76 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం వల్ల రైతులు, ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. కుడి కాల్వ పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. త్వరలో కాల్వ పనులు ప్రారంభించి రైతుల సాగునీటి కష్టాలను తీరుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరువును తెచ్చిందని కొందరు మూర్ఖులు అంటున్నారని మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యానికి రాజకీయం అంటగట్టడం సంకుచిత బుద్ధికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో ఎప్పటికప్పుడు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను గమనిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు సాగు,తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని, ఎన్ని కోట్లయిన వెచ్చించేందుకు సర్కార్ సిద్ధంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో కే.మహేశ్వర్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వి.గంగాధర్, వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ జమునసగేశ్, ఎంపీడీఓ రాము, తహసీల్దార్ శ్రీనివాస్, డీఈలు తిరుపతి, చంద్రయ్య, ఏడీలు సత్యనారాయణ, అంజయ్య, ఏఈలు సవాయి నాయక్, శ్రీధర్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.త

వెనుకబడిన వర్గాలు ఎదగాలి

-మంత్రి పొన్నం ప్రభాకర్ - ఆత్మీయ సన్మానం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - కరీంనగర్

వెనుకబడిన కులాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నదే మా లక్ష్యం అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ కుల గణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఆత్మీయ సన్మాన మహోత్సవం శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివిధ బీసీ కులాల సంఘాలు ఘనంగా సన్మానం చేశారు. కరీంనగర్‌లో బీసీ కుల సంఘాలు భారీగా హాజరయ్యారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బలహీన వర్గాల మంత్రిగా ఇక్కడకి వచ్చా, మీరంతా నన్ను మరింత ముందుకు నడపాలన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా మా ప్రభుత్వం మరింత ముందుకు వెళ్తుందన్నారు. ప్రతి కుటుంబంలో విద్యా ద్వారా మరింత ప్రాధాన్యత ఇస్తే ఆ కుటుంబం మరింత ఎదుగుతుందన్నారు. బలహీన వర్గాల బిడ్డగా కుల వృత్తులకు మరింత అభివృద్ధి జరగడానికి కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసాం అని, వృత్తులు మారుతున్న కాలాలకు అనుగుణంగా మరింత సాంకేతికతను జోడించి అధునాతన సౌకర్యాలతో వృత్తులను మోడర్న్‌గా తీర్చిదిద్దుతాం అని తెలిపారు. కార్పొరేషన్స్ ఏర్పాటు తొలి అడుగు అని, కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా బలోపేతం అవడంపై మరింత ముందుకు పోతాం అన్నారు. బీసీ కుల గణన తీర్మానం చేసుకున్నాం అని, దీని ద్వారా బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మన వర్గాలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వృద్ధి చెందాలంటే ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక చైర్మెన్ మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్, కన్వీనర్ వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంవర్థక శాఖ డైరీ ఆవిష్కరణ :

కరీంనగర్ జిల్లా పశు వైద్యాధికారులు, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కి పశు వైద్యాధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంవర్ధక శాఖ డైరీని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌లో చేరిన పిట్టల రవీందర్ :

మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో తెలంగాణ మత్స్య పారిశ్రామిక సంఘ కరీంనగర్ జిల్లా చైర్మెన్ పిట్టల రవీందర్, కొత్తపల్లి మండల జెడ్పీటీసీ పిట్టల కరుణ, పిట్టల విష్ణు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

ఘనంగా ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు

నవతెలంగాణ - గంభీరావుపేట :

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో తయారవుతున్న వివిధ రకాల వస్తువుల నాణ్యత, ఆహార పదార్థాల నాణ్యత, వస్తువుల తయారీ విధానంలో జరుగుతున్న కల్తీనీ ఏవిధంగా తెలుసుకోవాలనే వంటి విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి మనోహర్, అర్థశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్, కోఆర్డినేటర్ డాక్టర్ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ పిఓ ధర్మపురి, సీనియర్ అధ్యాపకురాలు శ్రీవల్లి, డాక్టర్ శ్రావణ్,ఆది విష్ణు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

17న 'గంగలో విషనాగులు' పుస్తక పరిచయ కార్యక్రమం

నవతెలంగాణ - కరీంనగర్

ప్రజ్ఞాభారతి, జాతీయ సాహిత్య పరిషత్, సమాచార భారతి సంయుక్త నిర్వహణలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు స్థానిక వాగేశ్వరి డిగ్రీ కాలేజ్‌లో రాజీవ్ మల్హోత్రా, విజయ విశ్వనాథన్ రచించిన 'ద స్నేక్స్ ఇన్ గంగా' తెలుగు అనువాదం 'గంగలో విషనాగులు' పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తడిగొప్పల శంకరయ్య, గాజుల రవీందర్, మందల నగేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి కుందారపు మహేశ్వర్, ప్రధాన వక్తగా గంగలో విషనాగులు తెలుగు అనువాదకులు డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి, జాగృతి పత్రిక పూర్వ సంపాదకుడు వడ్డీ విజయసారథి, మహిళా డిగ్రీ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు బూర్ల దక్షిణామూర్తి, నవయుగ భారతి బాధ్యుడు రాంపల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

అల్ఫోర్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ - రామడుగు



విద్యార్థులకు వివిధ కళల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొనేలా ప్రోత్సాహాన్ని అందించడం చాలా స్ఫూర్తిదాయకమని, విజయాలను నమోదు చేయవచ్చని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ సమన్వయకర్త డాక్టర్ కెప్టెన్ బి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేశరాజ్‌పల్లిలో 'ప్రేరణ' పేరుతో అల్ఫోర్స్ పాఠశాల వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డితో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, సరస్వతీ మాత విగ్రహానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. చేయాల్సిన పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా చేయాలని సూచించారు. నరేందర్‌రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో విద్యార్థులు చదువుకోవడం చాలా అదృష్టమని చెప్పారు. కరీంనగర్ జిల్లాను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలబెడుతున్న నరేందర్ రెడ్డికి ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలను మాత్రమే సాధన చేయకుండా సమాజంలో వెలువడుతున్న పలు మార్పులను, చోటు చేసుకున్న సంచలనాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి నుంచి కృషి రత్న అవార్డును అందుకున్న మధుసూదన్‌రెడ్డిని సన్మానించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకర్షించాయి. వార్షిక ప్రణాళికల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ - జమ్మికుంట



రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జమ్మికుంట అధ్యక్షుడిగా దాసరి రాజేశ్వరరావును ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జమ్మికుంట బ్రాంచ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యదర్శిగా మొహమ్మద్ మొయినుద్దీన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా టి.వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శిగా శీలం మల్లేశం, సహాయ కార్యదర్శులుగా ఎం.పరశురాములు, జి.మొగిలి, బి.సమ్మయ్య, డి.సారంగపాణి, ఎస్.రామచందర్, ఎస్.రాజయ్య, కోశాధికారిగా బి.విద్యాసాగర్, సహాయ కోశాధికారిగా ఎండి.ఖాదర్ ఖాన్, గౌరవ సలహాదారులుగా జి.చంద్రయ్య, పి.మాణిక్యాలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలలతో సన్మానించారు.

కన్షీరామ్‌కు ఘన నివాళి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట : నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం బహుజన్ సమాజ్‌పార్టీ మండల అధ్యక్షుడు నీరటి భాను ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షిరాం 90వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీఎస్పీ మండల ఇన్‌చార్జి లింగాల సందీప్, సీనియర్ నాయకులు ఎడ్ల రాజ్‌కుమార్ హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు న్యాలకంటి లక్ష్మిరాజం, అందె శ్రీనివాస్, మండల కార్యదర్శులు గునుగంటి చిరంజీవి, బొడ్డు కిషన్, అందే ఈశ్వర్, సోషల్ మీడియా ఇంచార్జ్ గడ్డమీది సాయి చంద్, అందె బాబు, గడ్డం నవీన్, అందె గణేష్, దాసరి దేవ చంద్రం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కొనరావుపేట

మండలంలోని సుద్దాల గ్రామంలో మాన్య శ్రీ కాన్షిరాం జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మాన్యశ్రీ కాన్షిరాం ఆశయాలకు అనుగుణంగా బహుజన బిడ్డలు అంతా ఏకమై ఆయన కన్న కలల రాజ్యాధికారం సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎరవెళ్ళి విజయ్, దొబ్బల స్టీవెన్, జీవన్, ప్రశాంత్ కృపాకర్, మహేష్ పాల్గొన్నారు.

'గూడ కనకయ్యను విస్మరించడం సరికాదు'

నవతెలంగాణ - తిమ్మాపూర్

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ 8వ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం పబ్లిక్ టాయిలెట్స్, బస్తీ దావకాన వంటి కార్యక్రమాలకు దళిత నాయకుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, మాల సంఘం రాష్ట్ర కార్యదర్శి గూడ కనకయ్యకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు శంకుస్థాపన చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా గూడ కనకయ్య అల్గునూరు అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రయాణికుల సౌకర్యం పబ్లిక్ టాయిలెట్స్ ప్రభుత్వ పక్షాన నిర్మించాలని 114సార్లు ప్రజావాణిలో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌కు సిఫారసు చేయడంతో శుక్రవారం సాయంత్రం హుటాహుటిన శంకుస్థాపన చేశారన్నారు.

బాలికల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

చదువులోనే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత, సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలపై బాలికలకు అవగాహన కల్పిస్తూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచేలా అందరూ కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన కల్పించే అంశంపై జిల్లా స్థాయి అధికారుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు రుతుస్రావ శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. అపరిశుభ్రత వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. పాఠశాలల్లో బాలికలకు అవసరమైన వసతుల కల్పనకు సహకరిస్తానని తెలిపారు. కొన్ని ప్రయివేటు హాస్పిటల్లలో అనవసరమైన ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని, దీంతో మహిళలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిని నియంత్రించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రతి గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. అధికారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీఓ రవీందర్, డీఈఓ జనార్ధన్‌రావు, డీఆర్డీఓ శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ కపారాణి, యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్ స్వామి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా కృషిచేయండి

డీఆర్ఓ పవన్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్

ప్రతి ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గుతూ వస్తున్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అధికారులు కృషి చేయాలని డీఆర్ఓ పవన్ కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి స్వీప్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ.. ఓటర్లు అందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కాలేజీల్లో విద్యార్థులకు, స్వశక్తి మహిళా సంఘాల్లోని మహిళలను చైతన్య పంతులను చేయాలని అన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు వివిధ అంశాలపై అధికారులు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఓటింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ రవీందర్, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈవో జనార్ధన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎస్వైకే కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిమ్స్ విద్యార్థుల క్షేత్ర సందర్శన



కంపెనీని సందర్శించిన కిమ్స్ విద్యార్థులు

నవతెలంగాణ - కరీంనగర్

నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఫుడ్ సైన్స్, మైక్రో బయాలజీ విద్యార్థులు గురువారం సంగారెడ్డిలోని క్రౌన్ బీర్ పరిశ్రమను సందర్శించారని విద్యాసంస్థల వైస్ చైర్మెన్ పెరియాల సాకేత్ రామారావు తెలిపారు. ఈ సందర్శనలో తయారీ విధానం, తయారీకి కావాల్సిన ముడి పదార్థాలను, క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. సందర్శనలో ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, విభాగాధిపతి మహేష్, అధ్యాపకులు సంపత్ కుమార్, ప్రణయ, అంజలి, దీపిక పాల్గొన్నారు.

మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు




ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేసిన ఫౌండేషన్ అధ్యక్షురాలు

నవతెలంగాణ - కరీంనగర్

మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేశారు. స్కూల్ పిల్లల హాస్టల్స్‌లో వారి అవసరాల నిమిత్తం ఎండాకాలం సందర్భంగా వాటర్ బాటిల్స్ పంపిణీ, గవర్నమెంట్ హాస్టల్స్‌లో పిల్లలకు ప్రస్తుతం అన్యువల్ ఎగ్జామ్స్ సందర్భంగా పరీక్ష పాడ్, పెన్నులు, స్కేల్స్ స్టడీ మెటీరియల్ ఇచ్చారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్నశ్రీనివాస్, రూప హనురుప్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులు కేటాయింపు

నవతెలంగాణ - తిమ్మాపూర్



భూమిపూజ చేస్తున్న నాయకులు

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పలు పనులకు ఎంపీ బండి సంజయ్ నిధులు కేటాయించారని బీజేపీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి తెలిపారు. ఈజీఎస్ పనులకు సంబంధించి తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.కోటీ 25లక్షలు మంజూరు చేశారని తెలిపారు. రామక్రిష్ణకాలనీలోని రోడ్ల నిర్మాణానికి 25లక్షలతో పనులను శుక్రవారం ప్రారభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎడ్ల జోగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్

నగరంలోని హనుమాన్ నగర్‌కు చెందిన యువకుడు చదువుకోలేకపోయానని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు.. హనుమాన్‌నగర్‌కు చెందిన చెపియాల అశ్విత్ కుమార్(23) 2019లో ఇంటర్ చేశాడు. ఇంటర్లో ఫెయిల్ కావడంతో ఓపెన్ ఇంటర్ ద్వారా పూర్తి చేసిన చదువుల వెనుకబడిపోవడంతో ఉన్నత చదువులు చదవలేక పోయాడు. దీంతో తరచూ కుటుంబ సభ్యులతో బాధను వ్యక్తం చేసేవాడు. శుక్రవారం తల్లి, సోదరి సరుకులు తీసుకువచ్చేందుకు దుకాణానికి వెళ్లారు. ఇంటికి వచ్చేసరికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఎల్లయ్యగౌడ్ రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సరిలాలు తెలిపారు.